వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



ఎమ్మెల్యే కేపీ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ఎస్టీలు



కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణచైతన్య

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో పట్టణంలోని ఆయన నివాస గృహంలో మండలంలోని వెంకటాపురం గ్రామం నుంచి ఎస్.బయనపల్లె నుంచి సోమవారం భారీగా చేరి పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఎస్.బయనపల్లెకు చెందిన నూర్‌బాషా సంఘం నాయకులు చింతగుంట నరసింహులు ఆధ్వర్యంలో కాశన్న, పోతుగంటి సిద్ధయ్య, ఖాజావలి, కాసులు, సుల్తాన్, పీరయ్యలతో పాటు సుమారు 30 నూర్‌బాషా కుటుంబాల వారు వైఎస్సార్ సీపీకి మద్దతు తెలియజేస్తూ పార్టీలో చేరారు. వెంకటాపురం గ్రామానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన ఎస్టీలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. 13వ తేదీన నిర్వహించబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరం ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వేయించి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. పార్టీని గెలిపించుకునేందుకు కలిసి ముందుకు సాగుదామన్నారు. సచివాలయం కన్వీనర్ ఓబుల రావు యాదవ్, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, ముండ్లపాడు గ్రామ మాజీ సర్పంచి కలువా సుబ్బారావు, ఎంపీటీసీ వెంకటమహాలక్ష్మీ రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బారెడ్డి శేఖర్‌రెడ్డి, చక్కెర శ్రీనివాసరెడ్డి, చింతల రమణ, ఓబురాయి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

మార్కాపురం: పట్టణంలోని 21వ వార్డులో కౌన్సిలర్ షేక్ సలీం ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే అన్నా రాంబాబు తనయుడు కృష్ణచైతన్య సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించాలని చైతన్య వారికి విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన వారిలో బి.బలరామ్ సింగ్, వెంకటేశ్వర్లు, పఠాన్ షంషేర్, మణికంఠ, బాలాజీ సింగ్ ఉన్నారు. 24వ బ్లాక్‌కు చెందిన కేవీ నారాయణ రెడ్డి కూడా వైఎస్సార్ సీపీలో చేరారు. రఘుపతి శివ, కేవీ రెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని జంగంరెడ్డిపల్లి, లింగారెడ్డి కాలనీలకు చెందిన టీడీపీ నాయకుడు బూదాల పెద్దన్నతో సహా 20 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణచైతన్య సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీ కండువాలు కప్పి వారిని ఆయన సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని చైతన్య కోరారు. సర్పంచ్ శిరీషా దాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మందా కొండారెడ్డి, మందా శివారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో అన్నా కృష్ణచైతన్య



వైఎస్సార్ సీపీకి మద్దతు పలికిన నూర్‌బాషా సంఘ నేతలు

వైఎస్సార్ సీపీ నేతల ఇంటింటా ప్రచారం

కొనకనమిట్ల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ మహిళా నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. మండలంలోని పుట్టూరివారిపల్లి, ఎర్రగడ్డ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మహిళా నాయకురాళ్లు దోర్నాల వరలక్ష్మమ్మ, వరికూటి శిరీషా మాట్లాడుతూ 2024 మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలు అందరికీ ఉపయోగపడేలా ఉన్నాయని, అభివృద్ధి లక్ష్యంగా పాలన చేస్తున్న జగనన్నను మరొక్కసారి ఆశీర్వదించాలని ఇంటింటా నవరత్నాల మేనిఫెస్టో బుక్‌లెట్ అందజేశారు. ప్రచారంలో వైస్ సర్పంచ్ మెట్టు అల్లూరురెడ్డి, మాజీ సర్పంచ్ పునుగోటి అంజిరెడ్డి, పగడాల తిరుపతిరెడ్డి, మహిళా నాయకులు మోరా అరుణ, సుబ్బమ్మ, రాజ్యలక్ష్మి, గుంటూరు అనూరాధ, దోర్నాల మౌనిక, సానికొమ్ము భాగ్యలక్ష్మి, ఉడుముల రమణమ్మ, కట్టా లక్ష్మి, పోతిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.



పుట్టూరివారిపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు మహిళలు

ఓటర్లకు అవగాహన



చందవరంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

దొనకొండ: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలను గెలిపించుకోవాలని మండలంలోని చందవరం వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ఇంటి ముంగిటికే సంక్షేమ పథకాలు చేరుస్తున్నారని, అలాంటి నాయకుడిని మళ్లీ మనం ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఓటర్లకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, నూనె యోహాను, నూనె రవి, రాజేష్, మహానంది, ప్రభుదాసు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలి

పుల్లలచెరువు: సీఎం జగన్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలి, కవలకుంట్ల వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పోలిరెడ్డి అన్నారు. సోమవారం కవలకుంట్ల బూత్‌కమిటీల ఆధ్వర్యంలో ప్రతి గడపకూ వెళ్లి ఈవీఎంపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చంద్రశేఖర్‌కు, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు.

పోలీసుల కవాతు

పుల్లలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పుల్లలచెరువు ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా ఆధ్వర్యంలో సోమవారం పుల్లలచెరువులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కు నిర్భయంగా, ఎటువంటి పక్షపాతం లేకుండా వినియోగించుకొనేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని, మండల ప్రజలు కూడా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని, దీనిపై ప్రజలు పూర్తి సహకారం అందివ్వాలని కోరారు.

అభివృద్ధి ప్రదాతలు అన్నా, చెవిరెడ్డి



మార్కాపురం పట్టణంలో ప్రచారం చేస్తున్న ఇస్మాయిల్, ఇతర వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం టౌన్: అభివృద్ధి ప్రదాతలు అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను మార్కాపురం ఓటర్లు మంచి మెజారిటీతో గెలిపించాలని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 16వ బ్లాక్‌లో కౌన్సిలర్ దారివేముల హర్షితతో కలిసి సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 నెలల కాలంలో మార్కాపురం పట్టణం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. పట్టణంలో షాదీఖానా నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. శివారు ప్రాంతాల్లో రోడ్లు వేసి కాలువలు కట్టించినట్లు పేర్కొన్నారు. అవ్వా తాతలకు ప్రతి నెలా 1వ తేదీన పింఛను ఇవ్వడంతో పాటు పేదరికం కారణంగా చదువుకు దూరంకాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి, ఇంకా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత, ఆసరా పథకాలతో లబ్ధిదారులకు డీబీటీ విధానంలో ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. మహిళల పేరుమీదే ఇంటి పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 4వ వార్డులో డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, 9వ వార్డులో ఎం.సిరాజ్ బేగ్, 8వ వార్డులో దొడ్డా భాగ్యలక్ష్మి, 7వ వార్డులో కొత్త కృష్ణ, 18వ వార్డులో డి.కరీముల్లా, 11వ వార్డులో ఉత్తమ్‌కుమార్, 20వ వార్డులో షేక్ సలీం, 21వ వార్డులో షేక్ భానూ, 32వ వార్డులో షేక్ షెక్షావలి, 25వ వార్డులో చాటకొండ చంద్రశేఖర్, 24వ వార్డులో బుశ్శెట్టి నాగేశ్వరరావులు ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాళ్ల ఆది, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, రోజ్ లిడియా, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ జవ్వాజి రంగారెడ్డి, మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి ప్రచారం చేస్తున్నారు.

రేషన్ డీలర్ కోడ్ ఉల్లంఘన



లక్ష్మి ప్రచారంలో పోతవరం రేషన్ డీలర్ సురేష్

దర్శి: మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ఎస్.సురేష్.. టీడీపీ అభ్యర్థి లక్ష్మిని కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన సురేష్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. టీడీపీ అభ్యర్థులను కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పత్రికల్లో కథనాలు ప్రచురితమవుతున్నా కనీసం పట్టించుకుంటున్న దాఖలాలు కూడా లేవు. కొందరు అధికారులు టీడీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

రోప్ స్కిప్పింగ్‌లో గోల్డ్ మెడల్

త్రిపురాంతకం: దక్షిణ ఆసియా స్థాయిలో జరిగిన రోప్ స్కిప్పింగ్‌లో భారతదేశం తరఫున పాల్గొన్న బాలిక ప్రతిభ చాటింది. 13 దేశాలు పాల్గొన్న ఈపోటీల్లో మీనాక్షి అనే బాలిక గోల్డ్‌మెడల్ అందుకుంది. మండలంలోని సోమేపల్లిలో మల్లేశ్వరి చిల్లీస్ కంపెనీ, సీడ్స్, నర్సరీ నిర్వహిస్తున్న పల్లెల ఇంద్రశేఖరరెడ్డి, లక్ష్మిల కుమార్తె మీనాక్షి. దక్షిణ ఆసియా స్థాయిలో నేపాల్‌లోని ఖాట్మండ్‌లో రోప్ స్కిప్పింగ్ 2024 పోటీలు జరగ్గా భారత్ తరఫున ఎనిమిదేళ్ల మీనాక్షి అద్భుత ప్రదర్శన చాటి మొదటి స్థానంలో నిలిచింది. సోమేపల్లిలో సోమవారం కేక్ కట్ చేసి చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ ప్రచారంలో పంచాయతీ కార్యదర్శి



టీడీపీ ప్రచారంలో పంచాయతీ సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరంలో కొన్ని రోజులుగా టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం పెద్దారవీడు మండలం కంభంపాడు పంచాయతీ సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ప్రచారం చేస్తున్నాడు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి విజయం కోసం ఆయన తనయులు విష్ణుష్‌రెడ్డి, రోహిత్‌రెడ్డితో కలిసి మార్కాపుర మండలం రాయవరంలో విస్తృతంగా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరికీ కరపత్రాలు పంచుతూ గ్రామమంతా సుడిగాలి పర్యటన చేశాడు. ఇతను పనిచేసే కంభంపాడు పంచాయతీలో టీడీపీకి చెందిన వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ వారు తీసుకొచ్చే పనులు చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రేపు దాచూరి వర్ధంతి సభ

బేస్తవారిపేట: స్థానిక చిన్న కంభం రోడ్డులోని కాశీ చంద్రమౌళీశ్వరస్వామి కళ్యాణ మండపంలో ఉపాధ్యాయ ఉద్యమ సూరీడు దాచూరి రామిరెడ్డి వర్ధంతి జిల్లా స్థాయి సభ ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఐవీ రామిరెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్నీ మండలాల నుంచి యూటీఎఫ్ కార్యకర్తలు సభకు హాజరు కావాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 805 ఓట్లు పోలింగ్

మార్కాపురం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్‌లో సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా విధుల్లో ఉన్న 805 మంది పోలింగ్ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 54 మంది వృద్ధులు హోమ్ ఓటింగులో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

మార్కాపురం టౌన్: వడదెబ్బతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన పట్టణంలో సోమవారం జరిగింది. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. అలుగు వీధికి చెందిన షేక్ ఖాశింబీ (80) డంపింగ్ యార్డు వద్ద మృతదేహంగా కనిపించింది. సోషల్ మీడియాలో వచ్చిన ఫొటోల ఆధారంగా కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు తెలిపారు. కొన్ని రోజులుగా మార్కాపురం ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న విషయం తెలిసిందే.